www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 మార్చి 2025



నేడు పిజిఆర్‌ఎస్ రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎంఎల్‌సి ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పిజి ఆర్‌ఎస్ సెషన్‌లకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ మేరకు సూచనలు చేసినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీంతో సోమవారం పిజిఆర్‌ఎస్ నిర్వహించడం లేదని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం పోర్టల్‌లో సమీపంలో ఉన్న గ్రామ వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా అర్జీలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు అమలులో ఉంటుందని తెలిపారు.

నేడే ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్

- సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభం
- మొత్తం ఎనిమిది రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- తొలి ప్రాధాన్యతా ఓటులో 24 గంటల్లో ఫలితం



ఏలూరులో కౌంటింగ్‌కు చేసిన ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల కౌంటింగ్ సోమవారం జరగనుంది. ఈ ప్రక్రియకు ఏలూరు సిఆర్ రెడ్డి కాలేజీ వేదిక కానుంది. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఈ లెక్కింపు చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరిగిన విషయం విదితమే. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన బ్యాలెట్ బాక్సులన్నీ సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చారు. కౌంటింగ్ రోజు ఉదయం ఏడుగంటలకు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములు తెరిచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలులోకి చేర్చనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,14,984 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉండగా, రెండు జిల్లాల్లో 456 కేంద్రాల్లో 2,18,902 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ కొంచెం భిన్నంగా ఉంటుంది. ప్రాధాన్యతా అంకెల ఓట్ల ఆధారంగా ఓట్ల లెక్కింపు జరగనుంది. ముందుగా బ్యాలెట్లను కట్టలుగా కడతారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకూ కట్టలు కట్టే ప్రక్రియ సాగే అవకాశం ఉందని చెబుతున్నారు. సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఓట్ల లెక్కింపునకు మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు. టేబుల్‌కు వెయ్యి ఓట్లు చొప్పున ప్రతి రౌండ్లోనూ 28 వేల ఓట్ల వరకూ లెక్కించనున్నారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగనుంది. ఇంకా ముందుగా ఫలితం వెల్లడించేందుకు కౌంటింగ్. ప్రక్రియలో మార్పులు, చేర్పులు చేపట్టే అవకాశాలను అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఓట్ల లెక్కింపు ఒక్క రోజులో పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో షిఫ్టుల వారీగా పని చేసేందుకు మొత్తం 700 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. టేబుల్‌కు ఒక్కరు చొప్పున అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంది. ఓట్ల లెక్కింపు రోజు భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా పోలైన ఓట్లలో చెల్లుబాటు ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారు. చెల్లుబాటు అయిన ఓట్లలో మొదటి ప్రాధాన్యతతో వేసిన ఓట్లు సగానికంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. మొత్తం 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండు లక్షల ఓట్లు చెల్లుబాటు ఓట్లుగా పరిగణిస్తే విజేతగా ప్రకటించే అభ్యర్థికి లక్షా ఒక ఓటు రావాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఏ అభ్యర్థి ఈ మార్కును చేరుకోకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. గెలుపు కోటాకు సరిపడినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకూ మిగతా ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత ఓటు తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యతా ఓట్లు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆరోహణ క్రమంలో అభ్యర్థుల మొదటి ప్రాధాన్యతా ఓట్ల జాబితాను తయారు చేస్తారు. ఇలా ప్రతి అభ్యర్థికీ రెండో ప్రాధాన్యతా ఓటు ఎవరికి వేశారనేది లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తారు. ఇలా కింద నుంచి పైవరకూ ఇదే తరహాలో లెక్కించి ఈ ఓట్లను వారికి కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళతారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లలోనూ మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థీ చేరుకోకపోతే తృతీయ ప్రాధాన్యతా ఓట్లను గణించి ఆ అభ్యర్థులకు జమ చేస్తారు. ఎలిమినేషన్ రౌండ్ జరిగితే మొదటి ప్రాధాన్యతా ఓటుతోపాటు ఇతర ప్రాధాన్యతా ఓట్లు సైతం చాలా కీలకంగా మారనున్నాయి. ఎలిమినేషన్ రౌండ్‌కు ఓట్ల లెక్కింపు వెళ్తే ఫలితం రావడానికి రెండు రోజుల వరకూ పట్టే అవకాశం ఉంది.



ఏలూరులో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆ జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

నర్సరీ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణం

ప్రజాశక్తి-కడియం

కడియం సర్ ఆర్థర్ కాటన్ ఫార్మర్స్ నర్సరీ అసోసియేషన్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షత వహించగా పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షునిగా బోడపాటి గోపితోపాటు మిగతా సభ్యుల చేత మంత్రి దుర్గేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అయ్యప్ప నర్సరీ రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, దేశానికే తలమానికంగా నిలిచిన కడియం నర్సరీ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సభా ముఖంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, సోము వీర్రాజు, ఆకుల వీర్రాజు, వేగుళ్ల లీలా కృష్ణ, బండారు శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో నర్సరీ రైతులు పాల్గొన్నారు.



కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి దుర్గేష్

సత్యదేవ నర్సరీని సందర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక శ్రీ సత్యదేవ నర్సరీని ఆదివారం ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పితాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నర్సరీల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందనఆనరు. కూటమి ప్రభుత్వంలో పర్యాటరంగం మరింత అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఇప్పటికే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నారన్నారు. ఆయనకు సత్యదేవా నర్సరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లా పెద్ద సత్యనారాయణ వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. ఆయన వెంట మెర్ల కృష్ణ, చెక్కపల్లి పుల్లారావు తదితరులు ఉన్నారు.

నర్సరీ రంగంలో దేశ స్థాయి పేరుగాంచిన కడియం మండలం ఉద్యానవనాలు అద్భుతంగా ఉన్నాయని హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు అన్నారు. ఆయన ఆదివారం సత్యదేవా నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆయనకు స్వాగతం పలికారు. నర్సరీలోని ఇండోర్ మొక్కల రకాల గురించి, అరికపామ్ డ్వార్ఫ్ మొక్క గురించి ఆంజనేయులు వివరించారు. అనంతరం జడ్జి మల్లికార్జునరావు కొన్ని మొక్కలను ఆర్డర్ చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్, డిఎస్‌పి భవ్య కిషోర్, కడియం తహశీల్దార్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జికి మొక్కల గురించి వివరిస్తున్న పుల్లా ఆంజనేయులు

గ్రామాల్లో చురుగ్గా జలజీవన్ మిషన్ వర్క్స్

ప్రజాశక్తి-పెరవలి


మండలంలో జల్‌జీవన్ మిషన్ వర్క్స్ అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్.సాయికుమార్ తెలిపారు. మండలానికి రూ.17 కోట్ల 83 లక్షల గ్రాంట్ వచ్చిందన్నారు. ప్రస్తుతం కాకరపర్రు, కాపవరం, ముక్కామల, అజ్జరం, అన్నవరప్పాడు, పిట్టలవేమవరం, తీపర్రు గ్రామాల్లో వాటర్ ట్యాంకుల వర్క్ పూర్తయి నట్టు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో పనులు వేగం సాగుతున్నట్టు తెలిపారు. పైప్ లైన్స్ వాటర్ ట్యాంక్ నిర్మాణాలు వేగవంతం చేసినట్టు ఎఇ తెలిపారు. నాలుగు నెలల్లో అన్ని గ్రామాల్లో వర్కులు అధికారుల ఆదేశాల మేరకు పూర్తి చేయవలసి ఉందన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో, 6వ, 7వ, 8వ తరగతిలో మిగిలిన ఖాళీలకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తుల కోసం ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో సందర్శించాలని, అభ్యర్థుల రాత పరీక్ష ఏప్రిల్ 25వ తేదీ ద్వారా 5వ తరగతిలో 6, 7, 8వ తరగతిలో మిగిలి ఉన్న ఖాళీలకు ఎంపిక చేస్తామని ప్రిన్సిపల్ తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8712625028 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

కార్టూ'నిజం'



మృతుల కుటుంబాలకు జవహర్ పరామర్శ

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాడిపూడిలో ఇటీవల ఐదుగురు యువకులు మరణించిన సంఘటన దురదృష్టకరమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆదివారం తాడిపూడి గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. జరిగిన విషాద సంఘటన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో ఉందని, ఈ సంఘటనపై సిఎంతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. ప్రభుత్వం నుంచి మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా త్వరగా అందేలా కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ వెంట ఎఎంసి మాజీ చైర్మన్ వేగి సత్యనారాయణ, పార్లమెంట్ అధికార ప్రతినిధి బూరుగుపల్లి వీర్రాఘవులు, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రసాద్, జిల్లా తెలుగు యువత నాయకులు సిద్ధన రాధాకృష్ణ, నాయకులు ఆత్కూరి రాంబాబు, నామ సురేంద్ర, సిహెచ్. సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షులు తిరుమలశెట్టి సత్యనారాయణ, జనసేన నాయకులు లింగంపల్లి సుధీర్ ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న జవహర్

పలువురికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నిడదవోలు

స్థానిక చర్చిపేట బిలీవర్స్ ఈస్ట్రన్ చర్చ్ హోప్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్‌లో భీమవరం రాజేశ్వరీ హెల్త్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్య సమస్యలు రాకముందే ముందుగానే గుర్తించి వైద్యుల సలహా మేరకు వైద్యం తీసుకుంటే మంచిదని సూచించారు. రాజేశ్వరి హాస్పిటల్ నిర్వహిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చర్చ్‌పేట బిలివర్స్ ఈస్ట్రన్ చర్చ్ ఎన్జో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి హాస్పిటల్ డాక్టర్ అల్లూరి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ ఈ క్యాంపులో అధునాతనమైన విధానంలో బాడీ స్కానింగ్ చేయడం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా మందులు ఇస్తున్నట్టు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి తగిన విధంగా మందులు ఇచ్చి తక్కువ కాలంలోనే రోగాలు నయం చేసేందుకు ఈ వైద్యం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మంది పాల్గొని బాడీ స్కానింగ్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ కుమార్, గుమ్మాపు ప్రకాశం, రాఘవేంద్ర కుమార్, అంగారపు ప్రసన్న రాజు, రాజేశ్వరి హెల్త్ కేర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం నేత జువ్వల రాంబాబు

ప్రమాదాల నిలయం ధవళేశ్వరం రోడ్డు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ధవళేశ్వరం బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని బస్టాప్, కాటన్‌పేట సెంటర్, పోలీస్ స్టేషన్ సెంటర్ బస్టాండ్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో వాహనాలు వేగంగా దూసుకెళ్లడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డుపై వాహనాలు అతి వేగంగా వెళ్లడం ప్రధాన సమస్యగా మారింది. ఈ రోడ్డులో బస్సు స్టాప్‌లు ఉండటం వల్ల నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో ఇద్దరు యువకులు చనిపోయారు. దీనికి ముందు కూడా రెండు ప్రమాదాలు జరిగాయి. అయినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ సెంటర్ వద్ద, అటు ఇరిగేషన్ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగస్తులు అటు వేమగిరి వైపు వెళ్లే వాహనదారులు నిత్యం వెళు తుండడంతో అక్కడ మలుపు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు ఎంతైనా అవసరం ఉంది. బాలిక ఉన్నత పాఠశాల దగ్గర సమీపంలో ఉన్న బస్సు స్టాప్, కాటన్ పేట సెంటర్, పోలీస్ స్టేషన్ సెంటర్ బస్టాండ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరాతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ధవళేశ్వరంలో బస్టాండ్ రోడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించి ప్రచార ఆర్భాటాలు చేసుకోవడం తగదని పిడిఎస్‌యు నాయకులు విమర్శించారు. మావోభన్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల కార్యవర్గ సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్న నేపథ్యంలో అట్టహాసంగా అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్‌ను ప్రతిష్టాత్మకంగా విడుదల చేశారని, దీనిలో విద్యారంగానికి కేవలం నామమాత్రమైన నిధులు కేటాయించారని తెలిపారు. ప్రాథమిక విద్యకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు, మొత్తం 10.8 శాతం నిధులు కేటాయించడం ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ విద్యార్థులకు అన్యాయం చేయడమేనన్నారు. 2009 విద్యాహక్కు చట్టప్రకారం, కొఠారి కమిషన్ సిఫార్సులు లెక్కచేయకుండా ప్రభుత్వం నిసిగ్గుగా వ్యవహరించిందన్నారు. బడ్జెట్‌లో విద్యార్థులు, నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం దగా చేసిందన్నారు. తల్లికి వందనం పథకానికి కేవలం రూ.9,407 కోట్లతో ప్రతిపాదనలు చేసి మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, నాయకులు సిద్ధూ, రూపశంకర్, శ్రీను, భాను, నాగరాజు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో బకాయి ఆస్తి పన్నులను యజమానులు వెంటనే చెల్లించాల్సిందిగా నగర పాలక కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. 31-03-2025 తేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున యజమానులు బాకీ ఉన్న తమ పన్నులను చెల్లించి మౌలిక సదుపాయాలు, సేవలను పూర్తి స్థాయిలో అందించేందుకు తోడ్పడాలని కోరారు. నగరపాలక సంస్థకు ఇంటిపన్ను, ఖాళీస్థలం పన్ను, నీటి ఛార్జీలు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటాయని, పన్నులు, పన్నేతరాలు ఎంత ఎక్కువ శాతం వసూలు చేయగలుగుతే అంత అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. అందువల్ల బకాయిదారులు వెంటనే పన్నులు చెల్లించాలని, లేని యెడల నగరపాలక సంస్థ నిర్ధేశించిన ప్రకారం అత్యవసర సర్వీసులయిన కుళాయి కనెక్షన్, విద్యుత్ కనెక్షను నిలుపుదల చేస్తామని, ఆస్తి జప్తుకి చట్టప్రకారరం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన కౌంటర్లతో పాటు నగరంలోని పలు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి దాతలు ముందుకు రావాలని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు కోరారు. ఆదివారం దేవరపల్లిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎంఎల్ఎ సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ఐదేళ్లలో పిహెచ్‌సి నిర్లక్ష్యానికి గురయ్యిందని తెలిపారు. ఇక్కడ సరైన సదుపాయాలు లేక వైద్యం కోసం వస్తున్న పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పిహెచ్‌సిని అభివద్ధి పరచాలనే ఉద్దేశంతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా అందుబాటులో ఉన్న సిఎస్‌ఆర్ నిధుల ద్వారా, దాతల ద్వారా విరాళాలు సేకరించి త్వరలో రోగుల సౌకర్యార్థం నూతన బ్లాక్‌ను నిర్మించే దిశగా చర్యలు చేపడతామన్నారు. దీనికి ప్రజలందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురికి సిఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఆంద్రు అనిల్, నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు పాల్గొన్నారు.

పోలీసులకు ట్రాఫిక్ స్టాపర్ల అందజేత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడానికి టిడిపి సీనియర్ నాయకులు సావాడ శ్రీనివాసరెడ్డి ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌కు రూ.50 వేల విలువైన రెండు స్టాపర్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం సిఐ గణేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో స్టాపర్లు చాలా ముఖ్యమైనవని, వీటిని అందించిన సావాడ. శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ స్టాపర్లను ట్రాఫిక్ నియంత్రణలో సమర్థవంతంగా వినియోగిస్తామని తెలిపారు. సావాడ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి తన వంతు సహాయం చేయాలని ఈ స్టాపర్లు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ చంటి ఇంట బైరెడ్డి సందడి

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నం దేవుల వీరవెంకటసత్యనారాయణ (చంటి) ఇంట సీనియర్ నేత మాజీ ఎంఎల్ఎ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సందడి చేశారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తండ్రి అయిన రాజశేఖరరెడ్డి ఆదివారం కడియం నర్సరీలను సందర్శించారు. ఈ నేపథ్యంలో కడియం మండలం మాధవరాయుడుపాలెం వెళ్లి సర్పంచ్ చంటిని కలిశారు. ఈ సందర్భంగా చంటి ఆయనకు మొక్కను అందజేసి స్వాగతం పలికారు.. చంటి కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని బైరెడ్డి గుర్తు చేసుకున్నారు.

ప్రక్కిలంకలో 4,000 మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో ఆదివారం 4000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద గత నెల రోజులుగా జరుగుతున్న సూర్య సౌరయాగం ముగింపు సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు కౌతారపు విశ్వనాథ శర్మ పర్యవేక్షణలో శశిశేఖర మిత్ర బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నదాన కార్యక్రమంలో తాళ్లపూడి, గోపాలపురం, పోలవరం మండలాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పంట కాలువలో వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువలో గోపవరం వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులకు లభ్యమైంది. మృతిని వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, గుర్తుపట్టేందుకు వీలు లేకుండా మృతదేహం కుళ్ళిపోయిందని ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విఆర్ఓ డి.శైలజ సమక్షంలో మృతదేహానికి పంచనామా నిర్వహించామని అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన పురుషులు కనిపించకుండా ఉంటే కుటుంబీకులు ఆచూకీ కోసం ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ రాజేష్ కోరారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మద్యం తాగి ఆటో నడుపుతూ పట్టుబడ్డ వ్యక్తిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. ఆదివారం సాయంత్రం ఎస్ఐ ఎస్.రాము ఆత్రేయపురం సెంటర్ లో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. గ్రామానికి చెందిన బండి దిలీప్ మద్యం తాగి ఆటో నడుపుతూ వాహనా తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేలపై దాడి.. నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గ్రామాలలో పోలీసులు ఆదివారం కోడిపందేల శిబిరాలపై దాడులు నిర్వహించారు. అంకంపాలెం గ్రామ శివారున కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లను, రెండు కత్తులు, రూ.11 వందల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

కాలుష్యాన్ని ప్రోత్సహించిన వారిపై చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

కుంభమేళా పేరుతో గంగా నదిలో కాలుష్యాన్ని ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు మతపరమైన మిద్య కల్పన వల్ల తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెట్టుకోవద్దని, మత విశ్వాస పేరుతో మోసపోవద్దని సూచించారు. కుంభమేళాలో కోట్లాదిమంది స్నానాలు చేయటం వల్ల అక్కడ మల మూత్రాలు పెరిగిపోయి గంగానది నీటి నాణ్యత తీవ్రంగా పడిపోయిందన్నారు. నీటిలో కోలీఫామ్ బ్యాక్టీరియా ఉందని అవి స్నానం చేయడానికి, తాగడానికి పనికిరావని గుర్తుంచుకో వాలన్నారు. నిపుణులు ఇచ్చిన సూచనలకు విరుద్ధంగా యుపి సిఎం యోగి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటనలు ఇచ్చారని, వారిపై చర్యలు తీసుకోవాలని సుబ్బయ్య డిమాండ్ చేశారు. గతంలో గంగా నదిని నాశనం చేసిన పండిట్ రవిశంకర్‌కు పర్యావరణ పరిరక్షణ సంస్థ రూ.100 కోట్ల జరిమానా విధించిందని, కానీ ఇప్పటికీ ఆ జరిమానా చెల్లించలేదన్నారు. ప్రస్తుతం జరిగిన గంగా నదికి కుంభమేళాలో 60 కోట్ల మంది స్నానం చేయడం వల్ల ఆ నీళ్ల కలుషితమయ్యాయని, దీనికి ఎన్ని రెట్లు పరిహారం విధించాలో పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రకటించాలని కోరారు. ప్రజల్లో మత రహిత వాదనను పెంచాలని, దానికి పాలకులు మతాన్ని వినియోగించకూడ దన్నారు. శాస్త్రీయంగా ఆలోచించే సమాజాన్ని నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని హితవు పలికారు. దేశం అభివృద్ధి చెందాలంటే శాస్త్రీయ విధానాన్ని పాలకులు అనుసరించి ప్రజల్లో విజ్ఞానం పెంచాలని సుబ్బయ్య సూచించారు. ఈ సమావేశంలో భారత హేతువాద సంఘం సభ్యులు గ్రంధి నాగేశ్వరరావు, పసుపులేటి దుర్గారావు పాల్గొన్నారు.

గజ్జరంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-తాళ్లపూడి

గ్రామీణ ప్రాంతాలలో అవసరమైన ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో తమ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తాళ్లపూడిలోని శ్రీ సాయి స్ఫూర్తి మల్టీ ఆసుపత్రి సిఇఒ గూడ విజయరాజు అన్నారు. మండలంలోని గజ్జరం గ్రామంలో ఈ ఆసుపత్రి యాజమాన్యం బిగ్ టీవీ ఛానల్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ తాళ్లపూడి గోపాలపురం దేవరపల్లి కొవ్వూరు పోలవరం మండలాలకు మధ్యలో ఉంటూ ఈ మండలాల ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఏకైక ఆసుపత్రి తమదేనన్నారు. 110 మందికి వైద్య పరీక్షలు జరిపిన ఈ శిబిరంలో ఆసుపత్రి డాక్టర్ పాబోలు సీత భారతి, డాక్టర్ ఎ.డేవిడ్ రాజు, విటిజి.వర్మ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిగ్ టీవీ ప్రతినిధి శ్రీహరి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


సాయిశ్రీ హోమ్ నీడ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సాయిశ్రీ హోమ్ నీడ్స్ నూతన వ్యాపారాన్ని జగ్గంపేట ఎంఎల్ఎ, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ సాయిశ్రీ హోమ్‌నీడ్స్ వ్యాపారం దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టిడిపి యువ నేత అమర్ మాట్లాడుతూ తన నూతన వ్యాపారాన్ని ఎంఎల్ఎ నెహ్రూ ప్రారంభించడం ఎంతో సంతోషంగా భావిస్తున్నానని, వినియోగదారులందరికీ నమ్మకమైన, నాణ్యమైన వస్తువులను అందిస్తామని తెలిపారు.

పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహం

పట్టు పరిశ్రమ అధికారి గీతారాణి





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మల్బరీ తోటల పెంపకానికి పట్టు పరిశ్రమ ద్వారా రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని పట్టు పరిశ్రమ జిల్లా అధికారి బి.గీతారాణి అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలు, ఇన్‌పుట్ సబ్సిడీలు తదితర అంశాలను ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

జిల్లాలో ఎంత సాగు ఎక్కడెక్కడ జరుగుతుంది.?

జిల్లాలోని గొల్లప్రోలు, తుని, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రంగంపేట, పెద్దాపురం, పిఠాపురం, బిక్కవోలు మండలాల్లో మల్బరీ తోటల సాగు జరుగుతుంది. దాదాపు 2,164 ఎకరాల్లో సుమారు 1015 మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కకూన్ మార్కెట్ ఉంది. ప్రతి నెలా ఆదాయం వచ్చే సాగు కాబట్టి రైతులు మరింతగా అవగాహన పెంచుకోవాలి. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలతో బాటు రంపచోడవరం డివిజన్లలో మల్బరీ పంట సాగు జరుగుతుంది. రాష్ట్రంలో పట్టు పరిశ్రమ సంప్రదాయ జిల్లాలయిన చిత్తూరు, శ్రీ సత్య సాయి జిల్లాల తర్వాత 2022-23 సంవత్సరం కాకినాడ జిల్లా పట్టు గుళ్ళ ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉంది.

మల్బరీ నారు మొక్కల పెంపకానికి రాయితీలు?

మల్బరీ నారు మొక్కల పెంపకానికి ఒసి, బిసి రైతులకు రూ.22,500, ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రూ.27వేలు అందజేస్తుంది. ఇందులో ఒసి, బిసి రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ.15 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500, ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర ప్రభుత్వం రూ.9,500 రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 అందజేస్తుంది.

పట్టుపురుగుల గది నిర్మాణానికి రాయితీలు?

రేరింగ్ షెడ్డు ఒకటో రకానికి యూనిట్ ధరలు రూ.4.50 లక్షలు వస్తుంది. ఇందులో కేంద్రం రూ.2.25 లక్షలు, రాష్ట్రం రూ. 1,12,500, రైతు వాటాగా రూ, 1,12,500, రెండవ రకం షెడ్డుకి రూ.3.25 లక్షలు యూనిట్ ధర అయితే ఇందులో కేంద్రం రూ.1,62,500, రాష్ట్రం రూ.81,250, రైతు వాటాగా రూ.81,250 ఇవ్వాల్సి ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ఒకటవ రకం యూనిట్ ధర రూ.4.50 లక్షలు అయితే ఇందులో కేంద్రం రూ. 2,92,500, రాష్ట్రం రూ.1,12,500, రైతు వాటా రూ.45 వేలు ఉంటుంది. ఒకటవ రకం యూనిట్ ధర రూ.3.25 లక్షలు అయితే ఇందులో కేంద్రం రూ. 2,11,500, రాష్ట్రం రూ.81,250, రైతు వాటా రూ.32,500 ఉంటుంది.

రేరింగ్ పరికరాల ఏర్పాటుకు వచ్చే రాయితీలు ?

ఒకటవ రకం యూనిట్‌కు ప్రభుత్వం రూ.75 వేలు మంజూరు చేస్తుంది. ఇందులో రూ.56, 250 రాయితీగా వస్తుంది. అలాగే రెండవ రకానికి రూ.50 వేలు మంజూరు చేస్తుండగా ఇందులో రూ.37,500 రాయితీగా వస్తుంది. బై వాలెంటైన్ పట్టుగూళ్ల ఉత్పత్తిదారులకు కేజీ పట్టుగూళ్ళకు రూ. 50 చొప్పున ప్రోత్సాహక రాయితీ అందిస్తున్నాము. ఈ ఏడాదిలో రూ.9 లక్షలు ప్రోత్సాహక రాయితీ అందించాం. అలాగే ప్రయివేటు విభాగంలో ముడి పట్టు దారం ఉత్పత్తిదారులకు ఒక కేజీ పట్టు దారానికి రూ.130 చొప్పున ప్రోత్సాహక రాయితీ అందిస్తున్నాము. ఆర్‌కెవివై పథకం ద్వారా రేరింగ్ షెడ్లకు, వరండాల ఏర్పాటుకు రూ.30 వేలు సబ్సిడీ అందిస్తున్నాం. రెండు ఎకరాల్లో మల్బరీ తోటలు నాటినందుకు ఏడాదికి చిన్న, సన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.63 వేలు లబ్ధి చేకూర్చడమే కాకుండా రేరింగ్ షెడ్ నిర్మాణానికి ఒకటో రకానికి రూ.3 లక్షల 15 వేలు, రెండో రకం షెడ్ కు రూ.3 లక్షల 11 వేలు లబ్ధి చేకూరుతోంది.

'ఉపాధి' హామీ నిధులతో ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా.?

పట్టు పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు వీలుగా ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు కేటాయిస్తోంది. తద్వారా జిల్లాలోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతోంది. గరిష్టంగా 5 ఎకరాల్లో ఎకరాకు రూ.18,750 సబ్సిడీ వస్తుంది. ఉపాధి హామీ పథకంలో మల్బరీ తోటలు పెంపకంలో భాగంగా సబ్సీడీలను అందిస్తుంది. 2 ఎకరాలు ఉన్న రైతుకు ఈ మొత్తాన్ని మూడేళ్ళ పాటు ఇస్తారు. సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే ఈ రాయితీ ఇస్తున్నారు.


వెదురుమూడి మలుపు వద్ద గోతులు పడి ప్రమాద కరంగా ఉన్న రహదారి

గోతులమయంగా వెదురుమూడి - కొత్తూరు రహదారి

- అవస్థలు పడుతున్న వాహనదారులు, విద్యార్థులు
- మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల పరిధి వెదురుమూడి నుంచి కొత్తూరు సెంటర్ వెళ్లాలంటే ఆర్ అండ్ బి రహదారి గోతులతో ప్రమాద భరితంగా మారింది. ఈ రహదారి పై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతితో పెట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతీ రోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా పాఠశాలకు వెళ్లే వాహనాలు ద్విచక్ర వాహన దారులు వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రహదారి లో మలుపు ఉండడం ఆ మలుపు సమీపంలో పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు స్థానికలు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి మీదుగా విద్యార్థులు సైకిల్ పై పాఠశాలకు వెళ్లాలంటే పెద్ద గుంతలు ఏర్పడడంతో ఆ గోతుల్లో జారి పడే ప్రమాదం జరుగుతుందని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అలాగే వాహనదారులు ఈ గోతుల్లో రాకపోకలు సాగించడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు.కొత్తూరు, జొన్నాడ, రావులపాలెం, మండపేట తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి నిత్యం ఈ రహదారి మీదు గా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఎంతో రద్దీగా ఉంటున్న రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గోతులు ఏర్పడిన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం కోరారు. పిఠాపురంలో పర్యటించిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ కళాశాల్లో కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా పనిచేస్తున్న తమను సర్వీస్ రెగ్యులరైజేషన్ చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కావున కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా తమ సమస్య డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఆలయం ఎదుట నిర్మించిన గనిపోతురాజు ఆలయంలో స్వామివారి విగ్రహ పున్నప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ కార్య నిర్వహణ అధికారి ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచే వేదపండితులచే ప్రతిష్టా హెూమాలు, పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ట, విగ్రహ పున్నప్రతిష్టాపన, కలశస్థాపన చేసి బూరెలతో కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, అల్లంరాజు రామకృష్ణమూర్తి, గన్ని నారాయణరావు, గన్ని చిన్నబ్బు, సూరిబాబు, నామాల రాంపండు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం రమణయ్యపేటలో బాల్య వివాహాలపై అవగహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సిడిపిఓ వై.లక్ష్మీ మాట్లాడారు. అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని అన్నారు. నిర్ధిష్టమైన వయస్సు నిండిన తర్వాత స్త్రీలోని గర్భాశయం బిడ్డను మోయడానికి పరిపక్వత చెందుతుందని తెలిపారు. ఆ వయసులోనే బిడ్డ సంరక్షణ పట్ల ఆమె మానసికంగా సిద్ధపడుతుందన్నారు. చిన్న వయసులో వివాహం చేస్తే శిశువు సరిగా ఎదగదని గుర్తించుకోవాలన్నారు. బాల్య వివాహం చేస్తే పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు, తల్లిదనండ్రులు, వివాహానికి వచ్చిన పెద్దలు కూడా శిక్షార్హులేనని హెచ్చరించారు. కావున గ్రామాలు, పట్టణాల్లో బాల్యవివాహాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే అంగన్‌వాడీ, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. అనంతరం బాల్య వివాహాలను అరికడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.మార్తమ్మ, పద్మశ్రీ, సింహాచలం పాల్గొన్నారు.

రాంబాబు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పెద్దాపురం

సమాచార శాఖలో 32 సంవత్సరాల పాటు ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా సేవలందించిన సిహెచ్. రాంబాబు సేవలు అభినంద నీయమని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగా ర్జున అన్నారు. పదవీ విరమణ చేసిన రాంబాబుకు అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార శాఖలో విజువల్ సూపర్ వైజర్‌గా పెద్దాపురం, కాకినాడ, ఏలూరు కేంద్రాల్లో 32 సంవత్సరాలు సేవలందించారని గుర్తు చేశారు. పాత్రికేయుడు చల్లా విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, సి.బాబురావు, జి.ధర్మరాజు, ఎన్.సూరయ్య, ఆర్ఎస్.కుమార్, సిహెచ్.నరేష్, పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగిపేటలో ఈనెల 21 నుంచి జరుగుతున్న శంకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు ఆదివారం ముగిసింది. విన్నర్‌గా కొబ్బరి చెట్టు పేట జట్టు నిలవగా, రన్నర్ జట్టుగా కోరంగి క్రికెట్ క్లబ్ దక్కించుకుంది. ఈ సందర్భంగా చొల్లంగి పేట సర్పంచ్ కందిళ్ల గంగాభవాని, గంగబాబు, మాజీ సర్పంచ్ మైదు హరిబాబు విజేతలకు బహుమతులను అందజేశారు. టోర్నమెంటు నిర్వాహణకు సహకరించిన మాజీ సర్పంచ్ మైధు హరిబాబు, మాజీ ఎంపిటిసి మందాల సత్తిబాబు, చొల్లంగి ఉపసర్పంచ్ స్వర్ణ రాజు, మట్టా లింగమూర్తి, మొండి భీమశంకర్, గంపల నాగేశ్వరరావు, శీకోటి సింహాద్రి, కర్రీ చిన్నారెడ్డి నీలపల్లి సత్తిబాబు, కారే రాజు, రామసెట్టి హరిబాబు తదితరులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారే సత్యవతి, రాజబాబు, కంది రాము, నీలపాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఆసాధులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

50 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్ పురంలో గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ పూజ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. వీరిలో సుమారు 50 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన చల్లా బుజ్జిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కోట అప్పారావు, చల్లా వెంకటరమణ, మార్ని సూర్యారావు, పుప్పాల రమణ, పుప్పాల గిరి, యవరన అబ్బాయి, యవరన సత్తిబాబు, కిరణ్ కంటి ఆసుపత్రి ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ, టెక్నీషియన్ హేమ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో చేపల మృత్యువాత

ప్రజాశక్తి - జగ్గంపేట


మండలంలోని రామవరం ముత్యాలమ్మ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. ఎస్‌సి ఫిషరీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇరిగేషన్ చెరువు నుంచి ఆయకట్టు రైతులు పొలాలకు నీటిని వాడుకున్నారు. నీరు తగ్గుముఖం పట్టడంతో ఆదివారం విక్రయం చేసేందుకు సొసైటీ నిర్వాహకులు శనివారం సాయంత్రం చేపలను పట్టారు. పట్టికున్న చేపలను వలలో ఉంచి నీటిలోనే వదిలిపెట్టారు. అయితే ఆదివారం తెల్లవారుజామున చెరువులో నిల్వ చేసిన చేపలను బయటకు తీయగా మొత్తం చేపలు మృతి చెందాయి. సుమారు 3 టన్నులు చేపలు మృతి చెందాయని, రూ.3 లక్షల వరక నష్టం వాటిల్లిందని సొసైటీ సభ్యులు వాపోయారు. చేపలు మృతి చెందడంతో మత్స్య శాఖ కు చెల్లించాల్సిన పన్నును రద్దు చేయాలని వారు కోరారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వర రావు చెరువును సందర్శించారు.

వైసిపి నేత బాబ్జీకి పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం దళిత నాయకుడు, వైసిపి సీనియర్ నాయకులు ఉండ్రు బాబ్జి అమలాపురంలో ఆయన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బాబ్జీని సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, పోలిమాటి రామకృష్ణ, డాక్టర్ రాజశేఖర్, కుసుమ ప్రసాద్, వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను బాబ్జీని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


బాబ్జీని పరామర్శిస్తున్న చిన్నవరాజు, నాయకులు


జెసికి ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ అర్చకులు

భీమేశ్వరుని దర్శించుకున్న కాకినాడ జెసి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాజీవ్ మీనా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన భీమేశ్వర స్వామి వారి శివలింగానికి శ్రీ మాణిక్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటాన్ని తీర్థ ప్రసాదాలను జెసికి అందజేశారు. ఆయన వెంట పలువురు రెవెన్యూ అధికారులు వీఆర్వోలు ఉన్నారు.

పొలాలకు అందని సాగునీరు

ప్రజాశక్తి - రామచంద్రపురం

దాళ్వా వరి పంటకు సాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. జనవరిలో నాట్లు పూర్తి చేసుకున్న రైతన్నలు పంటలకు అధికంగా పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం చిరుపొట్ట దశకు వరిచేలు చేరుకున్నాయి. ఈ సమయంలో సాగునీరు అత్యంత అవసరం. పామర్రు పరిసర ప్రాంతాల్లో సాగునీరు సక్రమంగా అందడం లేదు దీంతో దాల్వా వరిచేలు ఎండిపోతున్నాయని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 15 రోజులుగా నీరు అందకపోవడంతో వరిచేలు బీటలు వారాయి. పొట్ట దశలో నీరు అందకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంట కాలువల్లో సాగునీరు లభ్యత అంతంత మాత్రమే ఉండడంతో రైతన్నలు దిక్కుతోచని పరిస్థితుల్లో సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో వరిచేలు మరింత బీటలు వారాయి. ఇ ప్పటికి అధికంగా పెట్టుబడులు పెట్టిన రైతన్నలు వరిచేలు ఎండిపోతే మరింత నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు, రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. సాగునీరు సక్రమంగా అందేలాగా అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. వెంటనే కాలువల్లో నీటి సాంద్రత పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని పామర్రు పరిసర ప్రాంతాలు రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


మాజీ మంత్రి విశ్వరూప్ ను సత్కరిస్తున్న గిరిజాకుమారి

మాజీ మంత్రి విశ్వరూప్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి మహిళా అధ్యక్షురాలుగా సన్నవిల్లి-నంగవరం ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజాకుమారి ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్‌ను అమలాపురంలోని ఆయన స్వగృహంలో గిరిజాకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి కృషి చేసినందుకు పినిపే విశ్వరూప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వరూప్ ను గిరిజాకుమారి దుశ్శాలువా కప్పి సత్కరించారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

ప్రజాశక్తి -మామిడికుదురు

కూటమి ప్రభుత్వం హామీల అమలు, వైఫల్యాలపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలని మండల శాఖ వైసిపి అధ్యక్షుడు కొమ్ముల రాము పేర్కొన్నారు. తీర్థయాత్రలు ముగించుకుని స్వగ్రామం పెదపట్నం లంక విచ్చేసిన ఆయనను ఈ సందర్భంగా ఆదివారం వైసిపి పార్టీ శ్రేణులు రామును మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ హామీలు అమలు చేయడం లేదన్నారు. వీటిపై ప్రజల లో ప్రచారం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, గెడ్డం వెంకటేశ్వరరావు, బాలం రమేష్, బత్తుల జనార్ధనరావు, చిక్కం బుజ్జి, పొలమూరి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు